# వ్యత్యాసం

ఎవరో వాకిలి తలుపు కొడుతున్నారు ....

అప్పటికి ఉదయం ఎనిమిది గంటలయింది. టీ తాగు తున్నవాడి నల్లా బద్దకంగా లేచి వెళ్ళి తలుపు తీశాను.

వాకిలి గుమ్మంలో ఎవరో అపరిచిత వ్యక్తి ...

“ఎవరి కోసం వచ్చార”ని అడిగాను

అపరిచిత వ్యక్తి నా పేరు చెప్పాడు.

“మీకు కావలసిన మనిషిని నేనే” అని చెప్పాను.

“ఓరి వెధవా! ఎంత లా వెక్కావురా? బొజ్జకూడా బాగా పెంచావే!”

అపరిచిత వ్యక్తి అంత చనువు తీసుకోవడం చూచి నేను ఉక్కిరి బిక్కిరి అయినాను. అంత అరమరిక లేకుండా మాట్లాడుతున్న మనిషిని ఇంకా అపరిచితు డనుకోవడం నాదే పొరపాటని తోచింది. “ఈ మహానుభావుడు ఎవరా?” అన్న ఆలోచనలో పడ్డాను. ఏమీ పాలుపోలేదు, సెకెండు సెకెండుకీ ఆలోచన కుంటు బడుతున్నది ...

నాకు చాలా మంది స్నేహితులు ఉన్నారు, కాని ఎవ్వరూ అంత చనువుగా, అంత పెంకెగా మాట్లాడరు. నన్ను ఎంతో గౌరవంగా చూస్తారు, మర్యాదగా మాట్లాడు తారు. దీనికి కొన్ని కారణాలు లేకపోలేదు. నాకు మంచి ఉద్యోగం ఉంది, నాలుగు పుస్తకాలు వ్రాసాను. రచయితగా కొంత కీర్తి ప్రతిష్టలుకూడా గడించాను. జీవితంలో ఒక

అంతస్తు చేరుకున్నాను. పై అంతస్తువాళ్ళని కలుసుకోకపోవడం మూలాన, కింది అంతస్తు ప్రజల స్తోత్రపాఠాలకి అలవాటుపడి, ఆ శ్రావ్యమైన స్తోత్రాలతోనే కాలం వెళ్ళబుచ్చుతున్నాను. ఈ సంధిగ్ధావస్థలో ఆ వచ్చిన వ్యక్తి పరిచితుడో, అపరిచితుడో తేల్చుకోలేక పోయాను.

కట్టెదుట నిల్చిన వ్యక్తిని నఖశిఖ పర్యంతం పరీక్షగా చూచాను. అయినా, అతను ఎవరో పోల్చుకోలేక పోయాను. మనిషి గుర్తుకు రావక పోవడంతో, బిత్తర చూపులు చూడడం మొద లెట్టాను.

మన మనోగత భావాల్ని, మన ముఖకవళిక పట్టిస్తుందని సాధారణంగా అంటారు. కాని అందులో ఏమాత్రం సత్యాం లేదు, ముఖ కవళిక కాక మన బిత్తర చూపులే మనని పట్టిస్తా యని నా ఉద్దేశం – నా పిచ్చి చూపుల్లో భావాన్ని అతను గ్రహించినట్టున్నాడు.

"డన్సు (Dunce) ఇంకా నన్ను గుర్తించ లేదా?" అని అతను వెంటనే అడిగాడు.

"డన్సు", "వెధవా" అన్నమాటలు, నా మెదడులో గిర్రున తిరిగి, ఎక్కడో అణగారి ఉన్న పూర్వస్మృతుల్ని కెలుకు తున్నాయి.

నా ఓటమిని ఒప్పుకోవడం నాకు ఇష్టం లేదు. కాగా అతను నన్ను అంటున్న మాటలు నాకు ఎంతో వెగటుగా ఉన్నాయి. ఉదయం లేచి ఎవరి మొహం చూచానో–ప్రేమ పూర్వకమైనవి అయినా – ఎన్నో తిట్లు పడుతున్నాను. నా జ్ఞాపకశక్తి రోజుకు రోజు క్షీణిస్తున్నందుకు, నన్ను నేనే నిందించుకున్నాను. స్వాధీనం తప్పుతున్న నా జ్ఞాపకశక్తిని

అతని కళ్ళముందు మరీ ఎత్తిచూపడం ఇష్టంలేక 'లోపలికి దయచేయండి' అని వెనక్కి మళ్ళి డ్రాయింగ్ రూము వేపు మర్యాదగా దారి తీశాను. అతనికి నా మర్యాద ఏమాత్రం రుచించనట్లు కనపడింది. ముందుకు సాగిపోతున్న నన్ను బుజం పట్టుకొని, తన వేపు మళ్లించి Throw him out of the window, pull him by the nose అని గట్టిగా అరిచాడు. నాకు వళ్ళు ఝల్లు మన్నది. ఫిఫ్తుఫారం లెఖ్ఖల మాస్టర్ ప్రభు నాకు చప్పున జ్ఞాపకం వచ్చాడు. నేను అమాంతంగా, ఆ వచ్చిన వ్యక్తి మొహంలోకి పరీక్షగా చూచాను. ఆ చిలిపి కళ్లే...ఆ కోల మొహమే... మొహం మాత్రం కాస్త ముదురెక్కింది... వెడల్పాటి కళ్లల్లోంచి, చిలిపితనం తొంగి చూస్తున్నది... చెవులు విశాలంగా ఉన్నాయి...గాడిద చెవులు అనేవాడు ప్రభు. ఇంక ఏమాత్రం సందేహం లేదు—రామస్వామే ఫిఫ్తు, సిక్స్తు ఫారాల్లో నాతో చదువుకున్న విద్యార్థి రామస్వామే...అప్పట్లో రామస్వామికి లెఖ్ఖలు బాగావచ్చేవికావు. లెఖ్ఖల మాస్టార్ ఎప్పుడూ అతన్ని డన్సు, బ్లాక్ హెడ్ అనేవాడు. ప్రభుకు ఏ విద్యార్థిపైనన్నా కోపం వస్తే, ఆ ప్రక్కన వున్న విద్యార్థిని ఉద్దేశించి Throw him out of the window, pull him by the nose అనే వాడు. అతనికి ఏ విద్యార్థిపైనైతే కోపం వచ్చేదో, ఆ విద్యార్థీ, ఆ ప్రక్క నున్న విద్యార్థీ ఉభయులూ మౌనం వహించి, తలలు దించేసుకునేవాళ్ళు. క్లాసుకూడా కిక్కురు మనకుండా మౌనం వహించేది ... ప్రభు ద్వారానే మాకు Dunce, Block head, Throw him out of the window, pull him by the nose అన్న మాటలు పట్టుబడ్డాయి — ఇవి

మా నిత్యజీవితాల్లో ప్రవేశించాయి. మేము కాలేజీకి వెళ్ళినా మమ్మల్ని ఆ మాటలు వీడలేదు...ఆలోచనా పరంపరల్లోంచి తేరుకొని, "అరే డన్ను నువ్వా" అని అన్నాను. రామస్వామికి నా తిట్టు, తిట్టుగా తోచలేదు. పైగా అతనికి ఎంతో సంతోషాన్ని కలుగజేసింది. తన మొహాన్నంతా నవ్వుతో పులుముకొని, "ఎంత సేపటికి గుర్తించావురా?" అని నన్ను గట్టిగా కౌగలించుకున్నాడు. అనాలోచితంగా నేనూ అతన్ని కౌగలించుకున్నాను. బాల్య స్నేహితులం ఉభయులమూ, ఒకరి కౌగిలిలో, ఇంకొకరం విలీనమైనాం—

కౌగిలి విదిలించుకొని మెడ వెనకాలనించి అతని బుజం పైన చెయ్యి వేసి, అతన్ని డ్రాయింగ్ రూములోకి నడిపించుకు వచ్చాను.

"పెళ్ళైందా?"

"పిల్లలు ఏమైనా ఉన్నారా?"

"ఏమి ఉద్యోగం చేస్తున్నావు?"

రామస్వామి నా పైన ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాడు.

"ముందు కూచో, తరువాత నీ ప్రశ్నలన్నిటికీ తాపీగా సమాధానం చెబుతా" నన్నాను.

ఉభయులం ఒకటే సోఫాలో పక్క పక్కగా కూర్చున్నాం – సోఫాలో కూర్చోవడంతోనే రామస్వామి తన ప్రశ్న లన్నిటినీ తిరిగి ఒక్కొక్కటిగా వేశాడు.

నా పెళ్ళి సంగతీ, పిల్లల సంగతీ, ఉద్యోగం సంగతి చెప్పాను. నా పెళ్ళాన్నీ పిల్లల్నీ చూశాడు; సంతోషించాడు. నా భార్యనీ పిల్లల్నీ డ్రాయింగు రూంలోంచి లోపలికి పంపించి వేసి "ఇంక నీ సంగతి చెప్పు" మని అడిగాను.

మెట్రిక్యులేషన్ ప్యాసు కావడంతోనే చదువు ఆపివేశాను. టైపూ, షార్టుహాండూ నేర్చుకున్నాను. హైద్రాబాద్‌లో స్టెనోగ్రాఫర్ ఉద్యోగం కోసం వెతికాను. అప్పట్లో దొరకలేదు. పొట్ట చేతపట్టుకొని బొంబాయికి వెళ్ళాను. వెంటనే ఒక ఉద్యోగం దొరికింది. మొదట చేరిన ఫరమ్‌లోనే క్రమంగా పైకి వచ్చాను. ఒక మహారాష్ట్ర యువతిని పెళ్ళి చేసుకున్నాను. నలుగురు పిల్లలు. అదే ఫరమ్‌లో ప్రస్తుతం మేనేజరుగా వుంటున్నాను. అలవెన్సులూ, అవీకాక, జీతం పన్నెండు వందలు, ఉండడానికి ఒక ఇల్లూ, తిరగటానికి ఒక కారు కూడా ఇచ్చారు ఫరమ్‌వాళ్ళు. ఏదో 'మీ పుణ్యమా' అని, కడుపులో చల్ల కదలకుండా, జీవితం గడిచిపోతున్నదని ముగించాడు రామస్వామి తన కథనాన్ని.

అంతస్తుల జీవితానికి అలవాటు పడ్డ నేను, అతని అంతస్తుకీ, నా అంతస్తుకీ గల వ్యత్యాసాన్ని గ్రహించాను. నా జీతం నాలుగు వందలు — అతని జీతం పన్నెండు వందలు. అతని ఖరీదైన గ్యాబర్‌డీన్ సూటు, సిల్కుషర్టు, గోల్డ్ రిస్టు వాచ్ — నా కాటన్ షర్టునూ, స్టీల్ వాచ్‌నీ వేనోళ్ళ వెక్కిరిస్తున్నట్లు తోచింది. అంతవరకు "నాదే గొప్ప అంతస్తు" అని విర్రవీగిన వాడిని, నా అంతస్తుని చూచి నేనే అసహ్యించుకోవడం మొదలెట్టాను. సిరిసంపత్తుల్లో అతనితో తులతూగక పోవడం మూలాన, మేధస్సులో, విజ్ఞానంలో అతనికన్నా నేనే మిన్న అనిపించుకునే దురుద్దేశంతో, "నీకు ఒక విషయం చెప్పడం మరిచాను — ఈ మధ్య నేను కొన్ని పుస్తకాలు కూడా వ్రాశాను" అని అన్నాను. నా మాటలకి రామస్వామి 'ఇంప్రెస్' అయినట్లు తోచలేదు.

రామస్వామి చివరికి, "ఏం పుస్తకాలు వ్రాశావని" కూడా నన్ను అడగలేదు.

నేను గ్రంథకర్తనన్న విషయాన్ని అతను అంత చులకనగా చూడడం నాకేమాత్రం మనస్కరించలేదు.

"కీర్తి ప్రతిష్టల సంగతి ఎల్లావున్నా, ఈ రూపేణా కూడా నేను కొంత డబ్బు గడించుకో గలుగుతున్నానని" ఉద్దేశపూర్వకంగా చెప్పదల్చినా యథాలాపంగా చెప్పినట్లు నటించాను.

"సంవత్సరానికి ఎంత గిడుతుంద"ని అడిగాడు రామస్వామి.

"ఏవో నాలుగు అయిదువందలు గిడుతాయ"ని చెప్పాను అతని ప్రశ్నకి జవాబుగా.

"ఇంతేనా" అని విషయాన్ని చప్పరించివేశాడు రామస్వామి. కథకుడిగా, నవలా రచయితగా, నా కీర్తి దేశం నాలుగు మూలలా వ్యాపించిందని గర్విస్తున్న నాకు గొప్ప విఘాతం కలిగింది.

"నా పుస్తకాలేవీ నీవు చదవలేదా?" అని ఆత్రుతగా అడిగాను రామస్వామిని ఇంక అట్టేసేపు ఉండలేక. "లేదు" అని క్లుప్తంగా సమాధానం చెప్పాడు. నాకు తలకొట్టినట్లనిపించింది.

"నన్ను గురించికూడా వినలేదా?"—ఆందోళనతో నా కంఠం కొద్దిగా కంపించింది. "లేదు" "వినలేద"ని రామస్వామి నిశ్చలంగా జవాబు చెప్పాడు.

నా కాళ్ళకిందినుంచి భూమి కదిలిపోతున్నట్లనిపించింది—తల గిర్రున తిరిగింది—మరుక్షణానికిగాని తేరుకోలేకపోయాను.

"బొంబాయినుంచి నిన్న ఉదయం బండిలో హైద్రాబాద్ వచ్చాను. వచ్చినపని చూసుకునేసరికల్లా సాయంత్రం అయింది. వికాజీహోటల్‌లో సాయంత్రం మిత్రుడు ఒకడు కనపడితే, అతనిద్వారా మీ యింటి ఆచూకీ తీశాను. ఉదయం లేచిలేవడంతోనే ఇక్కడికి వచ్చి వాలాను" అని అన్నాడు రామస్వామి. మా యింటి భోగట్టా ఎల్లా కనుక్కున్నదీ వివరంగా చెబుతూ. హోటల్‌లో కనపడిన మిత్రుడుకూడా, నా కీర్తిప్రతిష్టల్నిగూర్చి రామస్వామికి ఏమీ చెప్పకపోవడం, నాకు వింతగా తోచింది.

"పోనీ, నా పుస్తకాలు ఇస్తాను, చదువుతావా?" అని అడిగాను రామస్వామిని, న్యాయాధికారిముందు తీర్పుకోసం నిరీక్షిస్తున్న నేరస్థుడి ధోరణిలో.—"నాకు చదవడానికికూడా బొత్తిగా తీరికలేదు. అల్లాంటప్పుడు నీ పుస్తకాలు చదువగలుగుతానని మాత్రం ఎల్లా చెప్పను?" అని అతనన్నాడు.

న్యాయాధికారి నేరస్థుడికి వ్యతిరేకంగా తీర్పు చెప్పాడు. ఇంక అపీలుకు ఏదైనా అవకాశం ఉందో, లేదో ఆలోచించాలి. లేదనే నా అనుమానం...

వంద బిందెల చన్నీళ్ళు నా పైన ఒకేసారి కుమ్మరించినట్లు తోచింది. శరీరం గడ్డకట్టుకుపోయింది — ఆ తరువాత కాసేపటివరకూ మాట్లాడలేకపోయాను.

మానవుడు తననిగూర్చి ఏవో కలలు కల్పించుకుంటాడు. తనచుట్టూ, ఒక వెలుతురు వలయాన్ని సృష్టించుకుంటాడు. తను కల్పించుకున్న వెలుతురులో రక్షణ, భద్రత పొందుతాడు. కాని ఆ వెలుతురు నిజమైన వెలుతురు కాదని తెలిసి

పోవడంతో, ఒక భ్రమ మాత్రమేనని గ్రహించడంతో, తిరిగి తలెత్తలేనంతగా కృంగిపోతాడు.

నా సంగతీ సరిగ్గా అంతే అయింది.

ఇంక నా పుస్తకాల్ని గూర్చి, రామస్వామితో ఎప్పుడూ మాట్లాడకూడదని నిశ్చయించుకున్నాను. రచయితగా, రామస్వామి, నా గొప్పని గ్రహించకపోవడం, అతని అజ్ఞానాన్నే సూచిస్తుందని సంతృప్తిచెందాను.

మా ఉభయులమధ్య నిశ్శబ్దత నిముషనిముషానికీ పేరుకుంటున్నది. నాకు భయమేసి, ఆ నిశ్శబ్దతని చీల్చడానికి నేను ప్రయత్నించలేదు.

ఇంతలోకే "బజారుకు వెళ్ళివద్దాం, లెమ్మ"న్నాడు రామస్వామి ఆ భరింపరాని నిశ్శబ్దాన్ని చీలుస్తూ—

"నేను ఆఫీసుకు వెళ్ళాలే!" అని అన్నాను సందేహిస్తూ.

"నేను ఇక్కడ ఇవ్వాళ రేపూ ఉంటున్నాను. ఈ రెండురోజులు సెలవుపెట్టెయ్యి" అన్నాడు రామస్వామి నిశ్చలంగా.

"వీలు పడదేమోనోయి" అని అన్నాను, కొద్దిగా మొండికేస్తూ.

"వీలుపడక పోవడమేమిటి? నీ మొహం! చక్కగా వీలుపడుతుంది—సెలవుపెట్టేసెయ్యి" అన్నాడు రామస్వామి నిశ్చింతగా.

అతని ఆప్యాయతకి నేను కాదనలేకపోయాను. దుస్తులు వేసుకొని రామస్వామితో బజారుకు బయల్దేరాను.

వాకిట్లో టాక్సీ నిలబడివుంది.

"టాక్సీ ఎందుకట్టిపెట్టావు, పంపించలేక పోయావా?" అని అన్నాను, నేను సహజమైన మధ్యతరగతి ధోరణిలో.

"ఎక్కావు కూర్చో" అన్నాడు రామస్వామి.

విధిలేక కిక్కురుమనకుండా టాక్సీలో కూర్చున్నాను.

టాక్సీ కదిలింది.

"ప్రభు ఎలా ఉన్నాడోయ్?" అని అడిగాడు రామస్వామి.

"ఇంకా నీకు తెలియదన్నమాట—చనిపోయి నాలుగు సంవత్సరాలు అయింది" అని చెప్పాను.

"అయ్యో, పాపం!" అన్నాడు రామస్వామి.

బజారుకు వెళ్ళి రామస్వామి రెండు చీరెలూ, జాకెట్ గుడ్డలూ, పిల్లలకి బట్టలూ, సూటుగుడ్డా, సిల్కు షర్టింగ్ కొన్నాడు.

చార్‌మినార్ దగ్గర పిల్లలకి స్వీట్సుకూడా కొన్నాడు.

"అవన్నీ రేపు సాయంత్రం వెళ్ళేముందు కొనుక్కో వచ్చుగా" అన్నాను నేను ఉండబట్టలేక.

"నీకు తెలియదులే—నీవు పెద్ద "డన్సువి" అన్నాడు, రామస్వామి జవాబుగా.

ఇంక అట్టే తిట్లుపడడం ఇష్టంలేక నేను మౌనం వహించాను. తిన్నగా మా యింటికి వెళ్ళమని టాక్సీడ్రైవర్‌తో చెప్పాడు.

రెండు గంటల తరువాత మా యింటికి చేరుకున్నాం.

ఇంటికి చేరీ చేరడంతోనే, పిల్లలనందర్నీ పిలవమన్నాడు. స్వీట్సు పంచిపెడతాడేమోనని నేను పిలిచాను.

స్వీట్సుతోపాటు తాను తెచ్చిన గుడ్డలుకూడా పిల్ల లకు పంచిపెట్టాడు.

"ఇవన్నీ ఇప్పుడు వాళ్ళకెందుకురా?" అని అన్నాను నేను సాలోచనగా.

"నీ మొహం, నీవు ఊరుకో, నీకు తెలియదులే" అంటూ అతను తుర్రున ఇంట్లోకి వెళ్ళాడు.

చేసేదేమీ లేక నేను కూడా అతన్ని అనుసరించాను.

పిల్లల ఉత్సాహానికీ, రామస్వామి ఉత్సాహానికీ మేర లేదు. సంతోష ప్రకటనలో, అతనికీ, పిల్లలకీ, తేడా ఏమీ కనుపించలేదు నాకు.

"ఇదుగోండి అక్కగారూ! ఈ చీరెలు, ఈ జాకెట్ గుడ్డలు తీసుకోండి" అని అన్నాడు రామస్వామి, మా ఆవిడతో.

మా ఆవిడ బిత్తర చూపులు చూచింది.

"దానికి ఈ చీరెలూ, జాకెట్ గుడ్డ లెందుకోయ్ — నీ కేమైనా మతిపోలేదు కద" అని అన్నాను నేను, చీరెలూ, జాకెటు గుడ్డలూ రామస్వామి చేతుల్లోంచి లాక్కుంటూ.

"నా దగ్గర వెధవ వేషా లెయ్యకు. గూబ గుయ్యి మంటుంది" అని హెచ్చరించాడు రామస్వామి.

అతని ఉత్సాహం చూస్తే, నిజంగా కొట్టేటట్లే కన బడ్డాడు. కాగా కొట్టడానికి చెయ్యి కూడా ఎత్తాడు. అతని ఆప్యాయతకి నేను విస్తుపోయాను.

"రేపు సాయంత్రం వరకూ మీ వారు ఇంటికి రా"రని మా ఆవిడతో రామస్వామి చెప్పాడు.

"ఎక్కడికి ఎత్తుకు పోతావురా నన్ను?" అని అడిగాను రామస్వామిని గొల్లుమంటూ.

రామస్వామి గొల్లు మన్నాడు.

మా ఆవిడ కూడా నవ్వింది.

"ఎత్తుకు పొయ్యేవాళ్ళు ముందుగా చెప్పి ఎత్తుకు పోతారా?" అని అన్నాడు రామస్వామి నవ్వుతూ.

డ్రాయింగ్ రూములోకి వచ్చిన తరువాత, సిల్కు-షర్టింగ్, సూటు గుడ్డా నా చేతిలో పెట్టాడు.

"పిల్లలకూ, మా ఆవిడకూ గుడ్డలు పెట్టడం బాగానే ఉంది. నా కెందుకురా గుడ్డలు పెట్టడం?" అని అడిగాను రామస్వామిని.

"ఎత్తుకు పోయేముందు, కొత్త గుడ్డలైనా పెట్టకుండా ఎత్తుకు పోవడం ఏమంత బాగుంటుందిరా?" అని రామస్వామి నా ప్రశ్నకి పై ప్రశ్న వేశాడు.

ఇద్దరం విరగబడి నవ్వు కున్నాం.

పిల్లలు మా చుట్టూ మూగి, చప్పట్లు కొడుతూ గొల్లు మన్నారు.

టాక్సీలో ఇంటినుంచి బయలు దేరాం.

ఆ రెండు రోజులూ, మేము వెళ్ళని బార్ లేదు, వెళ్ళని హోటల్ లేదు, ఎక్కని టాక్సీ లేదు.

ఒళ్లు మరిచి ఇంద్రభోగం అనుభవించాం.

ఖర్చు అయిన డబ్బుకి లెఖ్ఖ లేదు.

మధ్య తరగతి గోడలు ఫెట ఫెటా కూలిపోయినాయి.

మరునాటి సాయంత్రం రామస్వామితో స్టేషన్‌కు వెళ్ళాను.

"బ్లాక్ హెడ్! బొంబాయికి జాగ్రత్తగా వెళ్ళు" అని హెచ్చరిక చేశాను.

"డన్స్" ముందు నీ సంగతి ఆలోచించుకో, తూలి పడిపోతున్నావు" అన్నాడు రామస్వామి.

రైలు కదిలింది.—

నాకు ప్లాట్ ఫారం కదిలి వెళ్ళిపోతున్నట్లు తోచింది.

ఇంటికి ఎట్లా వచ్చిపడ్డానో తెలియదు.

బహుశా టాక్సీ డ్రైవర్ నన్ను ఇంట్లో దిగబెట్టి వెళ్ళి ఉంటాడు.

మరునాడు ఉదయం తల భారంగా ఉండి, పక్క-మీద నుంచి లేవలేక పోయాను.

బద్ధకంగా పక్క-మీద దొర్లుతూ ఆలోచించాను.

రెండు రోజులు కలలాగా గడిచి పోయాయి.

నాకూ, రామస్వామికీ ఏమిటి సంబంధం అన్న ఆలోచన తట్టింది. ఉభయులం చిన్ననాటి సహాధ్యాయులం — అంతే — ఏవో కొన్ని చిన్ననాటి స్మృతులు మమ్మల్ని ఏకం చేశాయి. రెండు రోజుల పాటు కలిసి మెలసి తిరిగాం. రామస్వామికి నా కీర్తి ప్రతిష్ఠల్తో నిమిత్తం లేదు. నా గొప్పతనంతో ప్రసక్తి లేదు. అతనికి నేను కావాలి. నా ద్వారా నా పిల్లలు కావాలి. మా యోగక్షేమాలతో మాత్రమే అతనికి సంబంధం—నాలోని చిన్ననాటి స్నేహితుడు మాత్రమే అతనికి కావాలి — నేటి నేను అతనికి ఏమాత్రం అక్క-ర లేదు. అతనికి ఆనాటి ఆప్యాయత కావాలి — ఆనాటి ప్రేమ కావాలి — ఆనాటి మిత్రుడిని వెంటబెట్టుకొని, రెండు రోజుల

పాటు ఇంద్రభోగం అనుభవించాడు. మిత్రుడిని అనుభవింప జేసాడు.

అతను ఎంతో ఆరోగ్యంగా బ్రతుకుతున్నాడని నాకు మొదటి సారిగా తోచింది. మరి నేనో—

నేను కల్పించుకున్న నా కృత్రిమ జీవితాన్ని ఏ క్షణం లోనూ నేను మరిచిపోలేక పోతున్నాను.

మధ్య తరగతికి సంబంధించిన వలయం నన్ను శాశ్వతంగా బంధించివేసింది. నన్ను బానిసని చేసింది.

రామస్వామివంటి వ్యక్తు లెవరో తోడ్పడితే తప్ప అప్పుడప్పుడు నాకు ఆ విషవలయం నుంచి విముక్తి కలగదు.

★